AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

9-6-2026 (Tuesday) MAIN EDITION

టెట్ హాల్‌టికెట్ల విడుదల

అక్షరటుడే, హైదరాబాద్: తెలంగాణ టెట్ 2026 హాల్‌టికెట్లు విడుదల అయ్యాయి. ఈ నెల 16 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో జూన్ 16 నుంచి 22వ తేదీ వరకు ఐదు రోజుల పాటు టెట్ తొలి విడత పరీక్షలు నిర్వహించనున్నారు. పేపర్ 1, పేపర్ 2 పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.37 లక్షల మంది అభ్యర్థుల దరఖాస్తు చేసుకున్నారు. నేటి నుంచే అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచినట్లు కన్వీనర్ జి. రమేశ్ వెల్లడించారు.

నాంపల్లిలో చేప ప్రసాదం పంపిణీ

అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ కొనసాగుతోంది. మృగశిర కార్తె సందర్భంగా సోమవారం రాత్రి 9 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు రాత్రి 9 గంటల వరకు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. చేప ప్రసాదం తీసుకుంటే ఆస్తమా, దమ్ము, శ్వాస సంబంధ ఇతర వ్యాధులు నయం అవుతాయనే నమ్మకం ఉంది. ప్రతి ఏటా మృగశిర కార్తె సందర్భంగా బత్తిని సోదరులు చేప ప్రసాదం పంపిణీ చేస్తారు. దీని కోసం తెలుగు రాష్ట్రాలతో దేశా నలుమూలల నుంచి ప్రజలు తరలి వచ్చారు.

పినరయి విజయన్ కుమార్తెకు ఈడీ నోటీసులు

అక్షరటుడే, నేషనల్ డెస్క్: కేరళ రాజకీయాల్లో కలకలం రేపుతూ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కంపెనీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా జూన్ 12న కొచ్చిలోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అధికారులు ఆమెను ఆదేశించారు.

ఐపీవో ముంగిట 'జెప్టో'కు ఈడీ షాక్

అక్షరటుడే, బిజినెస్ డెస్క్: 'జెప్టో' చుట్టూ ఇప్పుడు కార్పొరేట్ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. త్వరలోనే స్టాక్ మార్కెట్‌లో అడుగు పెట్టేందుకు ఐపీవోకి సిద్ధమవుతున్న ఈ కంపెనీ వ్యవస్థాపకులకు ఈడీ సమన్లు జారీ చేసింది. అయితే, ఈ విషయాన్ని దాచకుండా కంపెనీ తన రెగ్యులేటరీ డిస్‌క్లోజర్‌లో భాగంగా ఐపీవో ఫైలింగ్ పత్రాల్లోనే అధికారికంగా వెల్లడించడం విశేషం.

కేరళను వణికిస్తున్న కొత్త బాక్టీరియా..

అక్షరటుడే, నేషనల్ డెస్క్: కేరళ రాష్ట్రంలో 'షిగెల్లా' అనే బాక్టీరియా వల్ల వచ్చే 'షిగెల్లోసిస్' వ్యాధి కలకలం రేపుతోంది. కలుషితమైన ఆహారం, నీరు, అపరిశుభ్రత వల్ల వ్యాపించే ఈ తీవ్రమైన విరేచనాల వ్యాధి ప్రస్తుతం వయనాడ్, కోజికోడ్, అలప్పుజ, మలప్పురం జిల్లాల్లో వేగంగా విస్తరిస్తోంది. ఈ యేడు జూన్ 7 నాటికే 85 నిర్ధారిత కేసులు నమోదయ్యాయి.

సర్కార్ బడుల్లో 'ప్రీ ప్రైమరీ' టైమింగ్స్ మార్పు

అక్షరటుడే, హైదరాబాద్: ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరీ తరగతుల సమయ వేళలను రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి జిల్లాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు కొనసాగనున్నాయి. హైదరాబాద్/సికింద్రాబాద్‌లో ఉదయం 8:45 నుంచి మధ్యాహ్నం 12:15 వరకు క్లాసులు ఉంటాయి. వేసవిలో ఉదయం 7:45 నుంచి 12:30 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.



ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నివాసాల్లో ఏసీబీ సోదాలు

అక్షరటుడే, హైదరాబాద్: రోడ్లు, భవనాల ఇంజనీర్‌ఇన్‌చీఫ్ మోహన్ నాయక్‌కు సంబంధించిన ఆస్తులపై అవినీతి నిరోధక బ్యూరో (ఏసీబీ) మంగళవారం దాడులు నిర్వహించింది. ఈ అధికారి తన పదవిని దుర్వినియోగం చేసి వందల కోట్ల రూపాయల ఆస్తులను కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తోంది. మాదాపూర్‌లోని మోహన్ నాయక్ నివాహం సహా ఆయన ఆస్తులకు సంబంధించి తమకు వచ్చిన సమాచారంతో అధికారులు తనిఖీలు చేశారు. భారీగా బంగారం, వెండి, నగదు స్వాధీనం చేసుకున్నారు. పెద్దమొత్తంలో కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ వసూల్ చేస్తున్నట్లు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి . నిబంధనలకు విరుద్ధంగా నచ్చిన వారికి కాంట్రాక్టులు కట్టబెట్టడం ద్వారా కోట్ల రూపాయలు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

రెచ్చిపోతున్న నేపాలీ గ్యాంగ్‌లు..

హైదరాబాద్‌లో నేపాలీ గ్యాంగ్‌లు రెచ్చిపోతున్నాయి. భారీ చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. ధనవంతుల ఇళ్లే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాయి. తాజాగా గచ్చిబౌలిలో కిలో బంగారు ఆభరణాలను నేపాల్‌కు చెందిన ముఠా సభ్యులు చోరీ చేశారు.

– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ హైదరాబాద్ నగరంలో మరో చోరీ ■ కిలో బంగారం అపహరణ!

గచ్చిబౌలిలోని హిల్ రిడ్జ్ విల్లాలో నివాసం ఉంటున్న ఓ వ్యాపారవేత్త ఇంట్లో భారీ చోరీ జరిగింది. వీరి ఇంట్లో పని చేసే నేపాల్ దంపతులు ఈ పని చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వీరు సదరు వ్యాపారవేత్త ఇంట్లో నెల రోజుల క్రితం పనికి కుదిరారు. ఆయన కుటుంబంతో కలిసి ఇటీవల ముంబై వెళ్లాడు. ఆదివారం తిరిగి వచ్చాడు. అప్పటికే నేపాల్ దంపతులు కనిపించలేదు. దీంతో వారు చెప్పకుండా వెళ్లిపోయారని ఆయన భావించాడు.

వరుస ఘటనలు

నగరంలో నేపాలీ గ్యాంగ్‌లు దోపిడీలు, చోరీలతో రెచ్చిపోతున్నాయి. గత నెలలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజను నేపాల్ గ్యాంగ్ హత్య చేసిన విషయం తెలిసిందే. ఆమెను హత్య చేసి ఇంట్లోని నగలు, నగదుతో నిందితులు పారిపోయారు. అనంతరం కొద్ది రోజులకే జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గల్ఫ్ ఎంక్లేవ్‌లో నివాసం ఉండే డాక్టర్ విజయలక్ష్మి, మురళీమోహన్ దంపతులకు మత్తు మందు ఇచ్చి, కాళ్లు చేతులు కట్టేసి నేపాలి ముఠా దోపిడీకి పాల్పడింది. 60 తులాల బంగారం, రూ. 30 వేలు దొంగలించినట్లు బాధితులు తెలిపారు. జన్మదిన వేడుకలు చేసుకుంటామని చెప్పి, ఆ దంపతులపై దాడి చేసి దోపిడీ చేశారు.

పోలీసులు చెబుతున్నా..

ప్రధాన నగరాల్లో నేపాల్ గ్యాంగ్‌లు దోపిడీలు, చోరీలకు పాల్పడుతున్నాయి. వీరు మొదట పని మనుషులుగా చేరి నమ్మకస్తులుగా పని చేస్తున్నారు. అనంతరం ఇంట్లో ఎవరు లేని సమయంలో చోరీలు చేస్తున్నారు. యజమానులు ఒంటరిగా ఉన్న సమయంలో వారిపై దాడి చేసి డబ్బులు ఎత్తుకెళ్తున్నారు.

ఇంట్లో చూడగా..

వ్యాపారి తన ఇంట్లో గమనించగా.. పూజ గదిలో దేవుడి మెడలో ఉన్న బంగారు గొలుసుతో పాటుమరికొన్ని ఆభరణాలు మాయమైనట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలిస్తున్నారు. సుమారు కిలో బంగారం, వజ్రాలు చోరీ అయినట్లు తెలుస్తోంది.

అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించాలి: హరీశ్‌రావు

అక్షరటుడే, హైదరాబాద్: మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని మభ్యపెడుతున్న సీఎం రేవంత్ రెడ్డి.. ముందు అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62వేల అంగన్‌వాడీ టీచర్ల కష్టాలు మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సిబ్బంది వేతనాలపై హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సీతక్క సాటి మహిళల కన్నీటి గోస అర్థం చేసుకోకపోవడం శోచనీయమన్నారు.

హర్మూజ్ వద్ద కూలిన అమెరికా అపాచీ హెలికాప్టర్

అక్షరటుడే, నేషనల్ డెస్క్: అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న హర్మూజ్ జలసంధి సమీపంలో అమెరికాకు చెందిన 'అపాచీ' సైనిక హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్ పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ.. అందులోని ఇద్దరు పైలట్లు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ధృవీకరించారు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్ విధించిన ఆంక్షలను, దిగ్బంధనాన్ని ఛేదించేందుకు అమెరికాకు చెందిన యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) అక్కడ పహారా కాస్తోంది. అపాచీ హెలికాప్టర్లు, ఫైటర్ జెట్లు, డ్రోన్లతో అమెరికా దళాలు నిఘా పెట్టిన సమయంలోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అయితే, ఇదే సమయంలో అమెరికాకు చెందిన రీపర్ డ్రోన్లను తాము కూల్చివేసినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. దీంతో ఈ అపాచీ హెలికాప్టర్ ఇరాన్ జరిపిన కాల్పుల వల్ల కూలిపోయిందా? లేక ఏదైనా సాంకేతిక లోపం వల్ల ప్రమాదానికి గురైందా? అనే కోణంలో అమెరికా రక్షణ శాఖ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

ఫారెస్ట్ అధికారులను అడ్డుకున్న రైతులు..

అక్షరటుడే, ఆసిఫాబాద్: మొక్కలు నాటడానికి వెళ్తున్న ఫారెస్ట్ అధికారులను రైతులు అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఘటన కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. చింతలమానేపల్లి మండలంలో దిందాలో పోడు భూమి వివాదం నెలకొంది. రైతులు, అటవీ శాఖ అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. భూముల్లో మొక్కలు నాటేందుకు అటవీ అధికారులు వెళ్లారు. వారిని స్థానికులు అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. అటవీ శాఖ అధికారుల వాహనాలకు అడ్డుగా పడుకుని స్థానికులు నిరసన తెలిపారు. దీంతో కొందరు స్థానికులను ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి లోకేశ్

అక్షరటుడే, విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. 1500 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద మరుగుతున్న ఉక్కు మీద పడడంతో 8 మంది కార్మికులు చనిపోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలను మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఉదయం పరామర్శించారు. రూ.25 లక్షల పరిహారం కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి బాధితులను పరామర్శించారు. ఆయన ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించారు.

స్టీల్‌ప్లాంట్ ఘటన.. పరిహారం ప్రకటించిన పవన్

అక్షరటుడే, విశాఖపట్నం: వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో 8 మంది కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడి విశాఖపట్నం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుని పవన్ తెలుసుకున్నారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. వైద్యానికి అయ్యే ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదంలో 8 మంది చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. మరణించిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని తెలిపారు.

మినీ డ్రెస్‌లో సెగలు పుట్టిస్తున్న నువేక్ష!



ఇటీవల కాలంలో సెలబ్రిటీలు సోషల్ మీడియాలో ట్రెండీ అవుట్ ఫిట్స్‌తో ఆకట్టుకుంటున్నారు. జెన్‌జీ ఆలోచనలను దృష్టిలో పెట్టుకొని ట్రెండ్‌కు తగ్గట్టుగా దుస్తులను ధరిస్తూ గ్లామర్ వలకబోస్తున్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన బ్యూటీ నువేక్ష షేర్ చేసిన ఫొటోలు వైరల్‌గా మారాయి. రెడ్ కలర్ డీప్ స్కూప్ నెక్ లైన్‌తో డిజైన్ చేసిన రిబ్బెడ్ స్లీవ్ లెస్ క్రాప్ టాప్ ధరించిన ఈమె దీనికి కాంబినేషన్‌లో క్రీమ్ కలర్ రిబ్డ్ నిట్ షార్ట్‌తో జత చేసి ఫొటోలకు ఫోజులిచ్చింది.

–అక్షరటుడే, సినిమాడెస్క్